
# కొక్కొరొకో

శివల జగన్నాథరావు

ఆ ఇల్లూ, ఈ ఇల్లూ అని లేదు; ఈ వీధీ, ఆ వాడా అని కాదు; అన్ని చోట్ల నించీ, అన్ని ఊళ్ళ నించీ బయలుదేరేయవి. రాష్ట్ర వ్యాపితంగా మహానాడు లాటిది నిర్వహిద్దామని మొదట భావించేయి. కాని, ఆ ప్రతిపాదనని కొంత మంది కోడి మహాశయులు కొట్టి పారేయటం వలన 'కొక్కొరోకో' చేయాలని నిర్ణయించేయి.



అసలు చాలా కాలం అయ్యా, వాళ్ళల్లో ఈ అసంతృప్తి పెనం మీద ఆమ్లెట్టులా వుడుకుతోంది.

పుంజుల పురుష పుంగవులు వాడి ముక్కులతో, ఎర్రటి విప్లవాత్మకమైన తమ కిరీటాల్తో ఆవేశపడ్డారు.

"పుట్టడం గిట్టడానికేనా?" అని అరిచేడొక పురుష పుంజు.

"మన బతుక్కి అర్థం ఏవిటి?"

ఆలోచన కలగాలే గాని, ఆవేశం రావాలే గాని, వాటికి ఇంక ప్రతిబంధకాలు అడ్డే ఎదు రవవు.

ఏదో సమయంలో, ఎలాగో అలాగ ఒకర్నొకరు కలుసుకున్నారు. తమ అంతరంగాల్ని విప్పి చెప్పుకున్నారు.

"మనం మానవుడివి మేలుకొలువుతున్నాం!! వాడి మహత్కార్యాలకి ప్రారంభం, వాడి అంతరంగంలో అద్భుతమైన ఆలోచనలు!!, వాడ్ని మేలుకొలుపే మనం, మనల్ని మేలు కొల్పుకోలేకపోతున్నాము! అవునా?"

"అవును! అవును!!"

"ఇది మనకెంత సిగ్గుచేటు? అవునా?".

"అవును! అవును!!"

"అయ్యా! పండగొస్తే చాలయ్యా! గుండె గుభిల్లుమంటాది!!"

"మా యింటోళ్ళ పట్టా కత్తి పదువెడ్తాదయ్యా!"

"ఆల్లకి పండగ! మన బతుకు దండగా!"

"దేవుడికీ, దేవతకీ పూజలు చేస్తే చేస్కోమను! ఎవరూ ఒద్దన్లేదు! కాని, మన్నెందుకూ మధ్య ఛంపేడం?!!"

"ఆమ్మోరికి నయివేద్యాలెట్టాలంటే, నా జాతిని నామ రూపాల్లేకండా చేసేయ్యాలేటయ్యా?"

"ఇదన్యాయం గాదూ?"

"ఎందుక్కాదూ?"

"ఇది శానా ఘోరం కాదూ?"

"ఘోరవా? దాని బాబా?!"

"పీకి వరికేసీ, పిండివంటలా భావించడం, వయివేద్యవెట్టేసీ, వాలిక చప్పరించడం!!"

"ఏం? ఏ బూర్లో, గార్లో, బొబ్బట్లో, పరవాన్నవో వయివేద్యవెట్టుకోవద్దందా, అమ్మోరూ??"

"ఆఆ! అదిగదే వేమా అంటున్నా! అమ్మోరడిగిందా? నాకు కోళ్ళే కావాలని!"

"అసలావిడ నోరిప్పిందేట్రా?"

"ఎబ్బే! బొమ్మర్రా! బొమ్మకి మాటలేటి మీ. మొకం?"

"మూస్తన్నాం కావా?"

"ఏటి?"

"ఏ దేవుడి బొమ్మా వులకదూ; పలకదూ! అదీ కావాలన్దు! ఇదీ కావాలన్దూ!"

"భక్తి వుండనీయ్. అదొద్దనీ మనం అన్లేదు! ఎటొచ్చీ మనని, ఆళ్ళ భక్తికి బలి చెయ్యొద్దనీ అంటున్నాం!!"

"అర్ధాంతరంగా మన్ని హత్యలు చేస్తున్నారయ్యా!"

"హత్యలా?"

"కాక? మరేటి?"

"నిజవే! గాంధీని తుపాకీతో కాల్చేరనీ, ఆళ్ళంతా ఇప్పటికీ, రేడియోల్లోనీ, పేపర్లలోనీ, టి.వి.ల్లోనీ, మీటింగుల్లోనీ ఏడ్చీ ఛస్తన్నారు!!"

"మనని మాత్రం హత్య చెయ్యడం లేదూ?"

"వూర్కో! బావుండదు!"

"ఏటి బావుండదే? ఏటి బావుండదు?"

"ఆయన గొప్పోడు! ఆయన్తో మన్ని పోలిస్తే బావుండదనీ...."

"అదిగో! మళ్ళీ బావుండదంటావ్?"

"అది కాదురా! ఇలా అంటే సెన్సారు కత్తెరతో, మన పీకలు కత్తిరించి పారేస్తారేవోననీ!"

"మంత్రులేవన్నా మండిపడ్తారేవోననీ!"

"అయినా, గాంధీ మహాత్ముడితో మనకి పోలిక తప్పు! ఆ కొండంత దేవుడితో కోడి పుంజుకి సాపత్యమా?"

"మనవూ మహాత్ములమే! మనం ఆయన లాగే ఎవరికీ అపకారం చెయ్యడం లేదు"

"అయినా, ఆయనకి మల్లేనే, మననీ హత్య చేస్తన్నారు!"

"ఏంటో? ఈ హత్యల్ని ఆపేవోరెవరూ లేరని విచారంగా వున్నాది మాకు!!"

పుంజులూ, పెట్టలూ, పిల్లలూ కొర కొర మాట్లాడుకున్నాయి. వాటికెక్కడ ఏ స్థలం దొరికితే, అదే సభా స్థలిలా భావించీ సమావేశాలు జరుపుకున్నాయి. ఏకపక్ష నిర్ణయం గనక, మనుషులు కారు గనక, వాకవుట్లు చెయ్యలేదు! ఏవీ విసురుకోలేదు! మైకులు విరగ్గొట్టలేదు! పేపర్లలో పడిపోలేదు!!

ప్రభుత్వానికి వీళ్ళు వ్యతిరేక శక్తులని ఎవరూ భావించలేదు కనుక, బతికిపోయారు కోడి పుంగవులు! (అప్పటికి...) పోలీసులూ, తుపాకులూ, తూటాలూ వీళ్ళ మీదకి ఇంకా గురి పెట్టబడ లేదు!!

ఒకసారి, ఎవరో ఆసామీ మాత్రం కొంచెం విసుక్కున్నాడు. "ఏవిటీ వెధవ కోళ్ళిలా, ఈమధ్య, తెగ అరిచీ ఛస్తున్నాయేవిటి?" అన్నాడు.

"ఏమో? ఆటికేం బాధ వున్నదో?" అన్నాడింకోడు.

"బాధ వుంటే మెడలు వాల్చేదా? రోగం ఆటి ఒంటి మీద కనబడదా?"

"చూసేర్రా? మన శారీరక బాధలే ఆళ్ళ కగపడతాయన్నమమాట? మనకీ మనసుంటాదని ఆళ్ళకి తట్టదు!! మనకో హృదయం, గుండే, మనసూ, ఆత్మా, వాట్లో ఆలోచనలూ, అసంతృప్తీ, విచారవూ, దుఃఖవూ యివన్నీ ఆళ్ళకి అక్కర్లేదర్రా!!" అన్నాడో పుంజు బాబు కోపంగా.

"అందుకే మనం ఎంటనే ప్రభుత్వంతో పోరాడాల!" అని అరిచేదు ఓ పిల్ల కోడి.

"నీ మొఖంలా వుంది నీ మాట! వూర్కో కుర్ర నాయాలా!" అని కోప్పడింది పెట్ట తల్లి.

"ఏం నేనేటన్నాననీ?"

"ప్రభుత్వంతో మనం పోరాడ్డం ఏటి? మనని ప్రభుత్వం ఏం చేసింది? అదేం చంపలేదు! ప్రజలే మనల్ని ఛంపేస్తున్నారు!"

"యిది ప్రజా ప్రభుత్వం కాదే?"

"తెల్సీ తెలీని వాగుడు వాగకు! ముక్కుతో పొడ్చీగల్ను!"

"అబ్బ! మీరేంటర్రా? మధ్య దెబ్బలాటా?"

"లేకపోతే, చూడు మావ్వా! ఈడి మాటలూ? మనని వుంచుకున్నవోళ్ళు, పెంచుకున్న వోళ్లూ చంపుతూంటే, తుపాకీలూ, తెల్ల టోపీలూ చంపుతున్నాయంటాడేటీడు?"

అంతలో-

ఒక ఆయన "ఆగండి!" అనరిచేదు. "కాస్త నా మాట యింటారా?" అన్నాడు.

"ఒక మాటయితే యింటాం! పది మాటలయితే యినం!"

"అదేం?"

"మాకు... మనకి టైం లేదు! నో టైమ్!"

"స్సరేలేవోస్! సూడండిలా..."

"ఒక మాటయిందింక వూర్కో!"

"పొడ్చీగల్ను! యిను! పోలీసింట్లో కోడి వుండదా? మంత్రి మేడలో కోళ్ళుండవా? ఆళ్ళు మనల్ని మింగడం లేదా?"

ఒక నిరాశావాది నీరస కంఠంతో ఇలా పలికాడు:

"ఆ మాటకి వస్తే, ఎవర్ని ఎవరు మింగడం లేదు. మావా! పదులూ, వందలూ, వేలూ కోళ్ళల్లా మింగేసేవోళ్ళు కొంతమంది!"

"డబ్బా?"

"ఆ... లక్షలూ, కోట్లూ, గొర్రెల్లా, ఎను బోతుల్లా తినేసేవోళ్ళు కొంతమందీ!!"

"జనం మన్ని తినేస్తుంటే, ఆల్లని వ్యాపారస్థులు తినేస్తున్నారు కారా? ధరలు తినీస్తున్నాయ్! డబ్బు లేనోళ్ళని, డబ్బున్నోల్లు తినేస్తన్నారు!!"

"అయితే నువ్వేటంటావయ్యా?"

"అన్ని తినీడాల్లో, మనల్ని తినీడం ఎంత? అని అంటున్నా్రనా!!"

"అలా అనీ, వూర్కోమంటావు. అవునా?"

"వూ."

"పొడ్చీగల్ను? బకిరీగల్ను! వూర్కోర్కో!"

"వూర్కోర్కో! వూర్కోర్కో!!"

అంటూ కొంతసేపు పోలోమని అరిచేయి.

నిరాశావాది నీర్సంగా కళ్ళు మూస్కుని నిద్ర పోయాడు.

మరో ప్రతివాది కలగజేస్కుని- "ఒక్క మన్నే తినీస్తున్నట్టు అల్లా గోలెట్టీ ఛస్తారేట్రా? మేకల్ని ఛంపీడం లేదా? గొర్రెల్ని ఒగ్గేస్తన్నారా? ఏటి?"

"నోరు ముయ్యవే! ఒక్క మాట వుందనీ, ఇందాకటి దాకా ఎంతో సంతోషించేను! యింతలోనే, మీరు కూడా శాసనసభలాగా మారి పోయారు! ఛీఛీ!"

ఆ మాటలకి కోళ్ళు బుర్రలు వొంచు

కున్నాయి.

"యిదిగో! అందరి ఘోషా మనకి అవసరం!!"

"మన ఘోషే మనకి అవసరం!!"

"రేపే మనం బయల్దేరాలి!"

"మన కోర్కెలు చెప్పుకోవాల!"

"మన బాధలు తీరాల!"

"జై! కొక్కొరోకో!!"

*   *   *   *

వీధులన్నీ కోళ్ళతో నిండిపోయేయి!

"ఆ! అరే!" జనం విస్తుపోయారవి చూసి.

"ఏవిటీ విపరీతం?!"

"ఇన్ని కోళ్ళేవిటిలా?"

"వీధుల్లోంచీ ఈ సంచారం ఏవిటి?"

"కొక్కొరోకో!!"

అరుస్తూ కోళ్ళు నడిచీ వెళుతున్నాయి.

సమావేశాల్లో చర్చించిన అంశాల్నీ, అసంతృప్తుల్నీ, ఆవేశాలనీ, వివాదాలు చేస్తూ, అవి వీధుల వెంబడీ వెడుతూ వుంటే-

### ఇంటర్వ్యూ

మేనేజర్: ఇంతకుముందు పని చేసిన ఆఫీసులో నిద్రపోయే అలవాటుందా నీకు?

అబ్బెబ్బే... లేదు సార్. ఒట్టు!

మేనేజర్: మేమంతా నిద్రపోయేటప్పుడు నువ్వు మాత్రం నిద్ర పోకపోతే బాగోదు. అంచేత నీకీ ఉద్యోగం ఇవ్వడం లేదు.

- రామం పీణం,
బెంగుళూరు.

"కలికాలం అర్రా!"

"అంతా విపరీతం! కాకపోతే, ఏవాడేనా కోడేవిటి? ఇంత మందగా, ఇలా 'రాస్తారోకో' లాగా వెళ్ళడం ఏవిటి?"

అవి జనం ముక్కున వేలేసుకున్నారు.

బలహీనవర్గాలు వివాదాలు చేస్తూనే వున్నాయి.

"కనీసపు కోర్కెలు" తమవి, ఆయుష్షు తీరకుండా, చంపేవద్దనీ! ఎప్పుడో వచ్చే చావుని, ఇప్పుడే, తమకి ప్రసాదించవద్దనీ!! జీవితం అంటే జీవించడం గాని, చచ్చిపోవడం కాదు అనీ!! కోళ్ళది కూడా ఒక జన్మే అనీ!! ఒక ప్రాణి ఆక్రోశం దానిదనీ!! కండ, నెత్తురూ వున్న, బాధా, ఏడుపూ వున్న జీవి కోడి అనీ!"

వివాదాలు చేస్తూనే వున్నాయవి.

"కొక్కొరోకో" చేస్తున్నాయవి.

వాటి ఆక్రోశం, వాటి కేకలూ వింటున్నారా ఎవరైనా?

బోధపరచుకుంటున్నారా? పట్టించు కుంటున్నారా?

జనం ఆశ్చర్యపోతున్నారు.

నవ్వుతున్నారు.

అదిలిస్తున్నారు.

బెదిరిస్తున్నారు.

"కొక్కొరోకో" ఆగడం లేదు.

సాగుతూనే వున్నాది.

దీపావళి శుభాకాంక్షలతో ——

స్థాపితం: 1983    ఫోన్స్: 26046, 23781

రావూస్

కోచింగ్ సెంటర్

రెసిడెన్షియల్ కాలేజి

17/584 రజకవీధి, (లీలామహల్ వెనుక), నెల్లూరు-1.